కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం నూతన్‌కల్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్ చందు తెలిపారు. నూతన్‌కల్ గ్రామ పరిధిలోని అగ్రికల్చర్, పరిశ్రమల సర్వీసులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని ఎస్సీ కాలనీలో అనారోగ్య కారణంగా మృతిచెందిన నరసింహారావు మృతదేహాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబమైన నర్సింహరావు అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నేత అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి ‘అడ్డా’ కూలీలు

- భైకు ఉన్న వారికి పెట్రోల్‌కు రూ.200
- అదనంగా టిఫిన్లు, బిర్యానీ, మందు

ఎన్నికల ప్రచారంలో రోజుకు రూ.వెయ్యి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ పర్వం కొనసాగుతుండటంతో రాజకీయ సందడి మొదలైంది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ గెలుపు కోసం పోటాపోటీగా ప్రచారంలో జోరు పెంచాయి. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. విభిన్న ప్రచార వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల వేట కోసం పడరాని పాట్లు పడుతున్నారు. శివారు జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లోని డివిజన్లు, వార్డులు, బస్తీల్లో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారానికి ‘అడ్డా’ కూలీలను వినియోగించుకుంటున్నారు. దీంతో వారికి ఎన్నికల గిరాకీ పెరిగింది. నగర శివారుల్లో వివిధ పనుల కోసం దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలలోని పలు జిల్లాల నుంచి వలస వచ్చిన వందలాది మంది కూలీలు నివాసముంటున్నారు. వీరంతా నగరంతోపాటు శివారుల్లో భవన నిర్మాణ రంగంలో వివిధ పనుల కోసం వెళ్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రచార కార్యక్రమం ఊపందుకోవడంతో.. ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిరోజూ ఎన్నికల ప్రచార కార్యక్రమంతో సహా ఎన్నికల ప్రచార రథం వెంట వెళ్లటానికి అడ్డా కూలీలను వినియోగించుకుంటున్నారు. నగరంతో సహా శివారుల్లో కూలీల అడ్డాలు కూడా పదుల సంఖ్యలో ఉండటంతో.. పార్టీల అభ్యర్థులకు మరింత కలిసి వస్తోంది. పలువురు అభ్యర్థులు.. వారి అనుచరులను అడ్డాల వద్దకు పంపించి కూలీల పేర్లు, వారి ఫోన్ నంబర్లు సేకరించటంతో పాటు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారా.. లేదా అనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే.. కూలీ డబ్బులతో పాటు బైకు ఉంటే.. పెట్రోల్, భోజనం, రాత్రి వరకు ప్రచారంలో పాల్గొంటే.. మద్యం వంటి సదుపాయం కల్పిస్తామని ఆఫర్ చేస్తున్నారు. దీంతో ఐదారు రోజులుగా అడ్డాల వద్దకు వెళ్తే కూలీలు దొరకడం లేదని పలువురు బిల్డర్లతో సహా ఇళ్లు నిర్మించుకుంటున్న యజమానులు వాపోతున్నారు.

ప్రతిరోజూ రూ.వెయ్యి.. అదనపు వసతులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అడ్డా కూలికి ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు రోజుకు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ప్రచారంలో పాల్గొనే వారికి బైకు ఉంటే రూ.200 పెట్రోలు పోయిస్తున్నారు. ఉదయం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే.. కూలీ డబ్బులతో పాటు టిఫిన్లు కూడా పెడుతున్నారు. అలాగే, మధ్యాహ్నం పూట అయితే.. బిర్యానీ లేదా భోజనం పెడుతున్నారు. రాత్రి వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే మాత్రం క్వార్టర్ మద్యం బాటిల్ ఇస్తున్నారు. ఎన్నికల పుణ్యమా అని కూలీ డబ్బులతోపాటు ఇతర వసతులు దొరకటంతో.. చాలామంది అడ్డా కూలీలు పనులు మాని వేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

రైతులు, నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్



కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి అన్నారు. బోడుప్పల్ 17వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో మాజీ సర్పంచ్, మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష యాదవ్ సతీమణి తోటకూర లక్ష్మితో కలిసి మంగళవారం ఆయన గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కేసీఆర్ చెప్పిన హామీలను నెరవేర్చలేదన్నారు. బూటకపు మాటలు చెబుతూ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వజ్రేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల నేస్తం.. కాంగ్రెస్ హస్తం



ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: ప్రజల నేస్తంగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, ఈ సారి సాగనంపడం ఖాయమన్నారు. ఏ పథకం ప్రవేశపెట్టినా, ఏ నిర్మాణం జరిగినా అందులో అవినీతి మాత్రమే రాజ్యమేలిందన్నారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు ప్రవేశపెట్టిందని, దాన్ని చూసి కాపీ కొట్టి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రజలు కూడా ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, జీఎస్వీ సతీష్‌కుమార్, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్‌లో మాట్లాడుతున్న అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షామా మహ్మద్, ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో పాటు బీసీ గణన చేపడతామని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షామా మహ్మద్ అన్నారు. బీసీ జపం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ తన మంత్రి వర్గంలో కేవలం ముగ్గురు బీసీలకే చోటు కల్పించడం సిగ్గు చేటన్నారు. బీసీల కోసం కేటాయించిన రూ.1300 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ బీఆర్ఎస్ టికెట్ రూ.400 కోట్లకు అమ్ముడు పోయిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉప్పల్‌లో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. 10 సంవత్సరాలుగా ఉప్పల్ అన్ని విధాలుగా వెనకకు నెట్టి వేయబడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదన్నారు.

- ఎలివేటెడ్ కారిడార్ అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ ఆరు సంవత్సరాలుగా నిర్మాణాన్ని పూర్తి చేయలేక పోగా కారణం నువ్వంటే నువ్వంటూ బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకరి మీద ఒకరు ఆరోపించుకోవడం సిగ్గుచేటన్నారు. ఆరేళ్లలో దాదాపు 25 మంది వరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.
- ఉప్పల్‌లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంది ఆగిరెడ్డి, తవిడ బోయిన గిరిబాబు, అధికార ప్రతినిధి సుధీర్‌రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, బోరంపేట కృష్ణ, తౌఫిక్, రఫిక్, బాకారం లక్ష్మణ్, కొంపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ప్రజల మద్దతు

మల్లాపూర్: డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి అడుగడుగునా ప్రజల మద్దతు పెరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. మల్లాపూర్ గోకుల్‌నగర్ కాలనీలో ప్రచారం చేశారు.

- నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు వీఎస్.ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

రామంతాపూర్: శ్రీనగర్ కాలనీలో మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు కార్యకర్తలు, నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అరవింద్‌నగర్ గాంధీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.



శ్రీనగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు



మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నెమలి అనిల్‌కుమార్

ఓట్లు దండిగా వేయండి.. కానీ..
ప్రలోభాలకు లొంగవద్దు



ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌లో సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న పలువురు వక్తలు

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

ఉప్పల్: ఓట్లు దండిగా వేయండి.. కానీ ప్రలోభాలకు లొంగకండి అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు.. ఈ ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందని, డబ్బు వరవళ్లు తొక్కుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులంతా చెడ్డవారు కాదని, మంచి వారు కూడా ఉన్నారని.. వారిని గుర్తించి సమాజానికి సేవ చేసే వారికి ఓటు వేయాలని సూచించారు. ఉప్పల్ ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది యువ కులు ఓటు నమోదు చేసుకున్నారని, వీరే సరైన నిర్ణేతలన్నారు. అయితే ఓటు వేసే విషయంలో గ్రామాల్లో దాదాపు 80 శాతానికి పైగా పోలింగ్ శాతం నమోదైతే పట్టణ ప్రాంతాల్లో కేవలం 60 శాతం దాటడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ రోజు సెలవు ఉండటం వల్ల ఐటీ ఉద్యోగులు ఓటు వేయడంలో బద్ధకిస్తున్నట్లు పరిశీలకులు చెబుతున్నారని, వారు కూడా తప్పని సరిగా ఓటు వేయాలని, వేయించాలని కోరారు. అభ్యర్థి నచ్చకపోతే నోటాకు ఓటు వేయాలని, లేదా ఉన్న వారిలో మంచి వారిని ఎన్నుకోవాలన్నారు. అనంతరం ఓటు వినియోగించుకుంటామని, ప్రలోభాలకు లొంగమని ప్రతిజ్ఞ చేయించారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధులు పద్మనాభరెడ్డి, భాస్కర్ రెడ్డి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, విశ్రాంత డీజీపీ గోపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రామలింగారెడ్డి, మన్నె నర్సింహారెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు తరులు పాల్గొన్నారు.



మంత్రులను కలిసిన బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: మంత్రి కేటీఆర్, హరీష్‌రావును మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, రఘుపతిరెడ్డి, కాటిపల్లి రవీందర్‌రెడ్డి, పల్లా కిరణ్‌కుమార్ రెడ్డి, గూడురు శైలేష్‌రెడ్డి, సీతాల విజయ్, వీరేష్, ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ పక్షపాతి కేసీఆర్

మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి/గౌతంనగర్: బ్రాహ్మణ పక్షపాతిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ఉపాధి కోసం బెస్ట్ పథకం, విదేశాల్లో ఉన్నత విద్య కోసం వివేకానంద ఓవర్సీస్ ఎడ్యుకేషన్, బీపీఎల్ కుటుంబాలకు రామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు కోచింగ్ కోసం ఆర్థిక సహాయంతో పాటు అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణ సంక్షేమ సమితి నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గౌతంనగర్‌లో..

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతాయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఇన్‌చార్జి జితేందర్‌రెడ్డి, నాయకులు మేకల రాముయాదవ్, పీవీ సత్యనారాయణ, సిద్దిరాములు, నరహరి, ప్రేమ్, కిట్టు, కన్నా, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజల్లో బీఆర్ఎస్‌కు అపూర్వ స్పందన



ఈసీఐఎల్ వద్ద ఓటు అభ్యర్థిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ప్రజల్లో బీఆర్ఎస్‌కు అపూర్వ స్పందన లభిస్తోందని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని కైలాసగిరిలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఆత్మీయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ బీఎల్ఆర్ ప్రచారం సాగించారు. హెచ్‌బీ కాలనీ స్థానికుడినైన తనను అక్కున చేర్చుకొని ఆశీర్వదించాలని కోరారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, పూస రమేష్ పాల్గొన్నారు.

చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు ప్రచారం..

కుషాయిగూడ: బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్, అయ్యప్పకాలనీ, సాయినగర్ కాలనీ, కృష్ణారెడ్డినగర్ కాలనీల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఈసీఐఎల్ వద్ద బీఎల్ఆర్ ప్రచారం..

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) వద్ద ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ప్రచారం నిర్వహించారు. సాయంత్రం కంపెనీ నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు, కార్మికులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీ కార్యకర్తలకు శిక్షణ

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల బీఆర్ఎస్ బూత్ కమిటీల శిక్షణ శిబిరం మంగళవారం రామంతాపూర్ శుభం గార్డెన్‌లో ప్రారంభమైంది. బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బూత్ కమిటీలో ఉన్న వారు క్రమశిక్షణతో ప్రచారం నిర్వహించాలన్నారు. డాక్టర్ బీవీ చారి, పసుల ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

మల్లాపూర్: ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపిస్తే ఉప్పల్‌ను అభివృద్ధి చేస్తానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్‌లో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు.

మార్నింగ్ వాకర్స్‌ను కలిసి..

రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రవీంద్రనగర్, వీరా రాజారెడ్డి పార్కుల్లో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.



మల్లాపూర్‌లో ఇస్త్రీ చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి



బీఎల్ఆర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

క్రైం కార్నర్..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

మల్కాజిగిరి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వృద్ధులు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరా నెహ్రూ నగర్‌కు చెందిన పాల్ అలియాస్ అంజయ్య(55) గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

దయానంద్‌నగర్‌కు చెందిన హెరాల్డ్ విక్టోరియా(55)కు మానసిక స్థితి బాగాలేదు. ఈ నెల 5వ తేదీన మల్లికార్జుననగర్‌లో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం ఆమె కనిపించకపోవడంతో విక్టోరియా భర్త జాన్సన్‌కు సమాచారం అందించింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను సోదరభావంతో చూడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను సోదరభావంతో చూడాలని లోటస్ ల్యాప్ పబ్లిక్‌స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం షీ టీమ్ వారిచే నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో, బయట ఆడ పిల్లలతో ఎలా ప్రవర్తించాలి, వారితో ఎలా మర్యాదగా నడుచుకోవాలో వివరించారు. అసభ్యకరంగా మాట్లాడరాదని, ప్రేమతో, సోదరభావంతో మెలగాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండకుండా యువతీ యువకులు వాహనాలు నడపరాదని, ఒక వేళ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. సెల్‌ఫోన్ వాడకం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో షీ టీం ఇన్‌స్పెక్టర్ ఆర్.కమలాబాయి, ట్రాఫిక్ ఎస్సై యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భేష్



మాట్లాడుతున్న మాధవరెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు అనే వలంటీర్ ట్రైనింగ్ వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన వందేమాతరం ఫౌండేషన్ కన్వీనర్ మాధవరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలకమన్నారు. స్కూళ్లలో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి చదువు బోధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శైలజ, జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్లు జగన్, మల్లిక, హాలియా, రచన, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేరకు ఈవీఎంలను సర్దుబాటు చేయాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ నెల 18న రెండో దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఎన్నికల పరిశీలకులు, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్రస్థాయి, ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ శబరీష్ కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు.

- ఎన్నికల తనిఖీలలో నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈఎస్ఎంఎస్ యాప్‌లో వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలన్నారు.
- జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
- సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి.. నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు.
- పోస్టల్ బ్యాలెట్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మోదీ సభకు బీజేపీ నాయకులు



గౌతంనగర్: ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ప్రధాని మోదీ సభకు గౌతంనగర్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, అధికార ప్రతినిధి రాందాస్ ధన్‌రాజ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, వాశంశెట్టి శ్రీనివాస్, అనిల్‌గుప్తా, మంజుల, రవి, బలరాం తదితరులు ఉన్నారు.

వాహన తనిఖీల్లో రూ.5 లక్షలు స్వాధీనం

మేడ్చల్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మేడ్చల్‌లో వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్‌వోటీ పోలీసులు తనిఖీల్లో భాగంగా రూ.5 లక్షలు పట్టుకున్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు అందులో భాగంగా మేడ్చల్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి కారులో రూ.5 లక్షలు లభ్యం కావడంతో సరైన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు నగదు సీజ్ చేశారు.